కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# పగ

"బర్...బర్...బర్" మంటూ కాలింగ్ బెల్ శబ్దం.

"ముత్తయ్యగారూ! లోపలికెళ్లి చూపించుకోండి" అన్న కాంపౌండర్ పిలుపుకు ఉలికిపాటుగా ఈ లోకంలోకి వచ్చాడు.



గంటలతరబడి పడిగాపులు తప్పవేమో అనుకున్నంతలోనే డాక్టర్ నుండి పిలుపురావడంతో ప్రాణం లేసొచ్చినట్లయింది. చేతిలో వున్న పోటుకర్రను గుమ్మంపక్కన నిలబెట్టి ముత్తయ్య ఆదరా బాదరాగా డాక్టరమ్మ గదిలోకెళ్లాడు.

"మీ పేరేంటి?" అడిగింది డాక్టర్ అనిత.

"ముత్తయ్య".

"వయస్సెంత?"

"డెబ్బై ఏళ్లమ్మా!"

"చెప్పండి! మీ సమస్యేంటో..."

"ఒంటిమీద మచ్చలు. ఒకటే దురద, మంటలు" చెప్తూనే చొక్కా పైకెత్తి చూపించాడు.

మచ్చల్ని కంటితో చూస్తూనే, అవేరకం జబ్బుకు సంబంధించినవో అనుభవం మీద ఆమెకు అర్థమైంది. కన్ఫర్మ్ చేసుకోవడానికన్నట్లు కొన్ని ప్రశ్న లడిగింది. "గీరుతుంటే పొట్టు రాల్తుందా?"

"అవునమ్మా! ఒంటిమీదేకాదు తలలోకూడా మచ్చలున్నాయి..." తలొంచి చూపించాడు.

"ఎంతకాలంనుంచి మచ్చలున్నాయి?"

"సంవత్సరంపైగానే... రెండేళ్లనుకోండి".

"ఒళ్లంతా వ్యాపించేదాకా ఎందుకు అశ్రద్ధ చేశారు. వ్యాధి ప్రారంభంలోనే రావచ్చుకదా"?

ఆమె ప్రశ్నకు ముత్తయ్యకు వెంటనే సమాధానం దొరకలేదు. తనకూ తెలుసు, గోటితో పొయ్యేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకోకూడదని... ప్రైవేటు ఆస్పత్రికి ఒట్టిచేతుల్తో ఎలా వెళ్లడం.

డాక్టర్ ఫీజులు... పరీక్షలు... మందులు... డబ్బు చేతిలో వుండొద్దూ... ఈ రోజు ఇలారావడానికి ఎన్ని అవమానాలు పడాల్సొచ్చింది!

"ఇంతకుముందేమన్నా మందులువాడారా?" తిరిగి డాక్టర్ ప్రశ్న. లేదన్నట్టు తల ఊపాడు.

"గవర్నమెంటు ఆసుపత్రికి రెండుమూడు సార్లెళ్లాను. ఏవో బిళ్లలూ, పూత మందిచ్చారు. ప్చ్... ఏం లాభం... తగ్గలేదు. ఈ దురద బాధ తట్టుకో లేక రక్తాలొచ్చేదాకా గీక్కోవడం... రాత్రిళ్లు నిద్ర పట్టిచావదు..." ఆ బాధ జీరగా ముత్తయ్య గొంతులోకి జారింది. డాక్టర్ పసిగట్టింది.

"మీదేవూరు?" సౌమ్యంగా అడిగింది.

"రెడ్డిపాలెమని పట్టణశివారు గ్రామం".

"పిల్లలెందరు?"

"ఇద్దరు కొడుకులు, ఒక కూతురండీ".

"మీరెక్కడుంటారు?"

"భార్య ఏనాడో పోయింది. ఒంటరిగా చేయి కాల్చుకోవడమేనమ్మా!" అన్నాడు.

"మీకు జరుగుబాటది బాగుందా. కుటుంబ పరంగా ఏమన్నా ఇబ్బంది లున్నాయా!" అడిగింది.

ముత్తయ్య ఒక డాక్టర్ నుండి ఊహించని ప్రశ్నలు. వైద్యంకోసమని వస్తే చుట్టంలా ఈ పలకరింపులూ...పరామర్శలేంటి? ఒక్కపూటలో...ఒక్క మాటతో చెప్పగలిగేవా? ఏళ్లతరబడి ధారపోసిన శ్రమ...తిన్న దెబ్బలు...నష్టాలు...కష్టాలు...ఎక్కడ మొదలెట్టి ఎక్కడ ముగించాలి? అయినా పరాయి మనిషితో చెప్పుకుంటేమాత్రం ఆరుస్తారా, తీరుస్తారా?...

"మా బతుకుగురించి...బాధల గురించి ఏం చెప్పమంటావులేమ్మా! మాతోపాటు వల్లకాట్లో కలవాల్సిందే" పేలవంగా నవ్వేడు.

"మీ జబ్బుకూ..నేనడిగే ప్రశ్నలకు సంబంధం ఏంటని మీరనుకోవచ్చు. ఏం లేదు... కొన్ని శారీరక వ్యాధులకు మనోవేదనా ఒక కారణం కావచ్చు. మనసులోవున్న బాధతగ్గితేనే శరీరానికొచ్చిన రోగం తగ్గేది" వివరంగా చెప్పింది డాక్టరమ్మ.

ముత్తయ్య డాక్టర్‌కేసి అయోమయంగా చూశాడు. తన ఊహకి ఏమాత్రం అందని ఒక కొత్తవిషయం తెలుసుకున్నాడు. మనసులోని బాధకు, ఒంటిమీద జబ్బుకు సంబంధం వుంటుందా?

"చూడండి! ఈ చర్మ వ్యాధిని సోరియాసిస్ అంటారు. ఎక్కువకాలం మందులు వాడాలి. కేవలం నేను రాసే మందులవల్ల మాత్రమే ఈ వ్యాధి తగ్గదు. మందులతో పాటు మానసిక ప్రశాంతతా చాల ముఖ్యం. ఒక నెలరోజులు మందులు వాడాక మళ్లీరండి" అంటూ ప్రిస్క్రిప్షన్ చేతిలో పెట్టింది. మందులు ఎలా వాడాలో, చీటీలో రాసున్న ప్రకారం మందులషాపువాళ్లు చెప్తారంటే, తలూపుతూ కన్సల్టింగ్ రూమ్ నుంచి బయటకొచ్చాడు ముత్తయ్య. మెల్లగా బయటికి నడిచాడు.

మందులషాపు చుట్టూ దడికట్టినట్లుగా జనం కిక్కిరిసివున్నారు. ప్రిస్క్రిప్షన్ షాపు కుర్రాడి చేతిలో పెట్టి స్టూలుమీద కూలబడ్డాడు.

మీ మనసులో వున్న బాధ తగ్గితేనే శరీరానికొచ్చిన రోగం తగ్గుతుందని డాక్టర్ చెప్పిన మాటలు పదే పదే స్మరణకొస్తున్నాయి ముత్తయ్యకు. ఏళ్ల తరబడి మనసులో గూడు కట్టుకున్న బాధ ఒక్క సారి చేత్తో తీసేసినట్టుపోతుందా?

ఉమ్మడి కుటుంబం. ముగ్గురన్నదమ్ములు. తండ్రి కాలంచేశాక మూడు కుంపట్లయ్యాయి. ఉన్నది తలా కాస్త పంచుకుంటే గొడ్డూ గోదాతో పాటు చిన్న ఇల్లు, నాలుగెకరాల మెట్ట వాటాకింద వచ్చింది. సొంతకుంపటి పెట్టుకున్నాక మొగుడూ పెళ్లాం సంసారం గురించి పెద్ద ఆలోచనలే చేశారు. నాలుగక్షరం ముక్కలు అబ్బితే పిల్లలు పట్నంలో చిన్నా, చితకా ఉద్యోగాల్లో కుదురుకోవచ్చు.

నాలుగెకరాలకుతోడు మరో రెండెకరాలు సంపాయించిస్తే వేణ్ణీళ్లకు చన్నీళ్లు తోడన్నట్టుగా ఏ లోటూ లేకుండా దర్జాగా బతుకుతారు.

అనుకున్నట్లు అన్నీ జరుగుతాయా! రాములమ్మ చదువు ఊరుబడి దాటలేదు. మగ పిల్లలు ఇద్దరూ డిగ్రీలు పూర్తిచేశారు. తిండికి, బట్టకూ, పిల్లల చదువులకూ బొటా బొటీ సరిపోయిందే గాని మిగులంటూ కనబడింది లేదు. ఆశపడ్డట్టుగా కుంట భూమి కొని కలుపుకున్నదీ లేదు.

ఎకరం పొలమిచ్చి, పాతికవేలు రొక్కంతో రాములమ్మ పెళ్లి జరిపించేశారు. మగపిల్లలిద్దరూ ఉద్యోగాల్లో కుదురుకున్నారు. ఆ తర్వాత రెండేళ్లకే మగ పిల్లల పెళ్లిళ్లూ జరిపించేశారు.

ఆడపిల్ల పెళ్లికైన బాకీకి తోడు మరికాస్త బాకీ జతయిందితప్ప ఒడ్డునపడలేదు. గట్టిగా రెండేళ్లు పంటలు పండితే బాకీలు ఒక లెక్కా!

కలిసొచ్చేకాలం పోయి కలిసిరాని కాలం మొదలైంది! సకాలంలో వర్షాలు కురవక మొలకెత్తిన మొలకలు మాడి మసైపోయాయి. మళ్లీ వర్షం పడగానే తిరిగి విత్తనాలు కొని విత్తాల్సివచ్చింది.

తీరా మొక్కలు ఎదిగి, పూతపూసి కాయలు కాసే సమయానికి నీళ్లతడి లేక నేల బెట్టిచ్చింది. పచ్చని పంటచేను ఎండి మోడైంది. పత్తి ఎకరాకి రెండు క్వింటాళ్లు కూడా పండని దుస్థితి. వ్యవసాయ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. పెట్టిన పెట్టుబడులు అప్పులుగా తేలాయి.

రెండేళ్లుగా మిరపకు మంచి రేటుండటంతో వున్న నాలుగెకరాల్లో సగం పత్తి, సగం మిరప సాగు వేద్దామనుకున్నాడు. మిరపకు పెట్టుబడులు, చాకిరీ ఎక్కువే! అయినా పంట కలిసొస్తే తేలిగ్గా అప్పుల నుంచి ఒడ్డునపడతామన్న ఆశ పుట్టుకొచ్చింది. వెనకడుగు వెయ్యదలుచుకోలేదు.

పెట్టుబడులకోసం పుట్టినచోటల్లా అప్పులు తెచ్చాడు. చెమటతోపాటు, వేలకు వేలు పంటకోసం ధారపోశాడు. ఆ యేడు, అదనుకు తగిన నీరు అందటంతో అటు పత్తి,

ఇటు మిరప విరగకాశాయి. రెండెకరాల మీద పత్తి పదిహేను క్వింటాళ్లయింది. ముప్పైవేలు దాకా చేతికొచ్చింది. మిరప దిగుబడొచ్చేదాకా పెట్టుబడులకు తడుముకోకుండా సరిపోతుందని సంబరపడ్డాడు.

మిరపచేను చూసినవాళ్లంతా ఎకరాకి పాతికి క్వింటాళ్లు తగ్గదంటుంటే ఆనందంతో ఒళ్లు పొంగేది. ధర క్వింటాకి నాలుగువేలు తక్కువలేదప్పుడు. ఇక కష్టాలన్నీ గట్టెక్కినట్టేనని లెక్కలు గడుతున్నాడు. చుట్టుపక్కల రైతులంతా కాయకోసి కల్లాల మీద ఆరబోశారు సంతోషంగా.

మొగుడూ పెళ్లాం చీకటిముఖాన కల్లానికెళ్లడం, సాళ్లుదీసి కాయలు ఆరబెట్టడం, సాయంత్రం పడమటి పొద్దు దిగాక ఇంటికి చేరడం. కనుచూపు మేర పరుచుకున్న మిరప కల్లాలు జూస్తుంటే, భూదేవమ్మ ఎర్రచీర చుట్టుకున్నట్టుండేది.

వ్యాపారులు కల్లాలదగ్గరకొచ్చి, క్వింటాకి నాలుగువేల రెండొందలిస్తామంటూ బేరాలు మొదలు పెట్టారు. రెండ్రోజులు ఆగితే ఇంక రెండు మూడొందలు పెరగొచ్చన్న ఆశ.

ఎప్పుడెప్పుడు పంటమ్ముదామా, అప్పుల్లోంచి బయటపడి నిశ్చింతగా వుందామా అన్న ఆలోచన తప్పితే మరొకటి లేదు. రైతులంతా రెండ్రోజుల్లో కాయంతా బొరేలు తొక్కొచ్చనుకున్నారు.

రాత్రికిరాత్రే కొంపమునిగింది. గాలి దుమారం మన్నూ, మిన్నూ ఏకంజేసింది. కుండపోత వాన కురిసి, బంగారంలాంటి కాయంతా నీటమునిగింది. ఏడుపులు... పెడబొబ్బలు... మొత్తు కోళ్ళు... ఓదార్పు ప్రకటనలు... అన్నీ కంటితుడుపు మాటలే గాని, నిజంగా నష్టాల్నిపూడ్చే దిక్కేది? పాతదీ, కొత్తదీ కలిపి లక్షల్లో అప్పు తేలింది.

ఈ జన్మకింతే! ఇక మీదట సాగుబడిచేసే దారి లేదు...అయినకాడికి భూమిని తెగనమ్ముకొని అప్పుల్లోంచి బయటపడాలి. బతికినంతకాలం కూలో నాలో చేసుకుంటూ పొట్టబోసుకోవడమే గత్యంతరమని తీర్మానానికొచ్చాడు.

అట్లా మల్లగుల్లాలు పడుతున్నప్పుడే దళారినరసయ్య చేనుకు బేరం తీసుకొచ్చాడు.

"ముత్తయ్యమావా! రియల్ ఎస్టేటోళ్లు...ఎంత పొలం దొరికితే అంత కొని ప్లాట్లు వెయ్యాలనుకుంటున్నారు. ఎకరాకి మూడున్నర లక్షలిస్తామంటున్నారు. మీ వాళ్లంతా సరేనంటున్నారు. కాకపోతే రేటుకాడ కాస్త ఆశపడ్తన్నారు. రేటుదేవుంది, రూపాయటో ఇటో ఫైనల్ జేసుకుందాం...నువ్వు 'ఊ' అనాలేగాని, రోడ్డుకి ముందెత్తునున్నోడివి గదా, పదేలు ఎక్కువిప్పిస్తాలే" తియ్యటి మాటల్తో రంగంలోకి దిగాడు.

ఏడాది క్రితం ఎకరా లక్షకు అమ్మిన పొలం...మూడున్నర లక్షలంటే మంచి రేటుబెట్తన్నట్టే..."ఆలోచించి చెప్తాలే నరసయ్యా!" అన్నాడు.

నాలుగైదురోజులు అన్నం సహించలేదు... కంటిమీద కునుకులేదు. తరతరాలుగా వస్తున్న ఆస్తి. ఉన్న భూమి కాస్తా తెగనమ్ముకుంటే బతకడానికి మరో ఆధారం ఏది?

భూమిని నమ్ముకొని మాత్రం బతికేదారుందా? ఇప్పటికైనా నష్టాల్లోంచి బయటపడేదెట్టా?

ఎగసాయం కలిసిరాక, ఏడాదికేడాది ఇట్టా అప్పుల్లో కూరుకుపోతుంటే చివరకుమాత్రం మిగిలేదేంటి? బాకీలు పెట్టిన వాళ్లందరూ ఇంటిచుట్టూ తిరిగినవాళ్లు తిరిగినట్టే వున్నారు.

ఇప్పుడమ్మితే, కొంత అప్పులకు పోగా నాలుగు రూపాయలన్నా చేతిలో మిగుల్తాయి!

కొడుకులిద్దరికీ, కూతురుకి విషయం చెప్పాడు. పెళ్లయినకాణ్ణించి, కట్నం కింద చదివిచ్చిన ఎకరాపంట డబ్బు దిగమింగారని అల్లుడు కారాలు, మిరియాలు నూరతన్నాడు. ఎకరం పొలం అమ్మితే వచ్చే డబ్బు చేతిలో పెట్టుకొని వడ్డీలకు తిప్పుకుంటే మంచి లాభసాటిగా వుంటుందన్నాడు.

కొడుకులూ ఇంచుమించు అలాగే మాట్లాడారు. బాకీలకు పోను మిగిలేదెంతన్నది తప్ప, బాకీల గురించి వాళ్లకేం పట్టనట్టేవున్నారు.

అవసరంలో వున్న రైతులంతా ఒక యాభైఎకరాలదాకా పొలం అమ్మదేలారు. నాలుగులక్షలకు తక్కువైతే అమ్మమంటూ ఒకమాట మీద నిలబడ్డారు. రియల్ ఎస్టేట్ వాళ్లు దిగిరాక తప్పలేదు.

ఎకరా నాలుగులక్షలకు బేరం ఖరారైంది. బయానాలు, ఎగ్రిమెంట్లు రాతకోతల య్యాయి.

ముత్తయ్యకు బయానాగా ముట్టిన డబ్బులోంచి అయిన బాకీలు మొత్తం అణాపైసల్తో సహా తీర్చేశాడు. రాములమ్మకివ్వాల్సిన డబ్బివ్వగా, చివరకు తొమ్మిది లక్షలు మిగులు తేలింది.

తనూ కొడుకుల్తో ఒక వాటా పంచుకున్నాడు. కొడుకులు ఎవరికి తోచిన పద్ధతిలో వాళ్లు ఆ డబ్బును సద్వినియోగం చేసుకున్నారు.

పెద్ద కొడుకు బ్యాంకులోను తీసుకొని టవున్లో ఇళ్లు కడ్తే, చిన్న కొడుకు భార్యపేర ఏదో వ్యాపారంలో భాగస్వామయ్యాడు.

ఐదారేళ్లు బాగానే గడిచింది. ఎగసాయం బాదర బందీలు లేకుండా తనూ, కోటమ్మ రెడ్డిపాలెంలోనే రెండు పాడిగేదెల్ని మేపుకుంటూ, నాలుగిళ్లకు పాలుబోసుకుంటూ ఇల్లు జరుపుకొస్తున్నారు.

వున్నట్లుండి కోటమ్మ అనారోగ్యంతో మంచానబడింది. క్యాన్సరంటే హైద్రాబాదు తీసుకెళ్లారు. అరవైవేలదాకా డబ్బయితే ఖర్చయిందిగాని మనిషి దక్కలేదు. దినకర్మలతో మొత్తం లక్ష పూర్తయింది. నలబైఏళ్లు కష్టసుఖాల్లో పాలుపంచుకొన్న మనిషి ఒంటరివాణ్ణి చేసి వెళ్లిపోయింది.

జీవితంలో భర్తీకాని లోటది. చేతనయినంతలో చారెడు బియ్యం ఉడకేసుకోడం, పచ్చడి మెతుకులు, మజ్జిగ నీళ్లతో పొట్ట పోసుకోవడం...ఇలా రోజులు భారంగా నెట్టుకొస్తున్నాడు.

కొడుకులిద్దరూ పీకలమీదికొచ్చిందంటూ అప్పుడు కాస్త, అప్పుడు కాస్త బ్యాంక్‌లో దాచుకున్న డబ్బు మొత్తం పీడించుకు తీసుకెళ్లారు.

తిరిగి ఇస్తామన్న మాటేగాని ఇచ్చిందే లేదు. అవసరమని అడిగినప్పుడల్లా పదో పరకో చేతిలో పెట్టి పంపుతున్నారు. అదీ తనకివ్వాల్సింది ఇస్తున్నట్లుగాక, ఉత్తినే ఇస్తున్నట్లు విసుర్లు, కసుర్లు. చేయిజారాక ఏమనుకొని ఏంలాభం!

ఈ పదేళ్లలో పట్టణ జనాభా పెరిగి చుట్టూవున్న శివారుగ్రామాల రూపురేఖలు మారిపొయ్యాయి.

పచ్చని పంటపొలాలు ఇండ్ల స్థలాలయ్యాయి. గజం ధర వేలకు పెరిగింది. ఆటుపోట్లు తట్టుకు నిలబడగలిగిన మోతుబరుల పొలాలు ఎకరా కోటి పలకడంతో కోట్లకు పడగెత్తారు.

అప్పులు, అగచాట్లు, అవమానాలు తట్టుకోలేక భూములమ్ముకొన్న సన్నకారు రైతుల గుండెల్లో గునపాలు దిగినట్లయింది. ఈ విషయాలన్నీ తెలిసి కొడుకులూ, కోడళ్లు, అల్లుడూ ఏకమై ముత్తయ్యను తిట్లు, శాపనార్థాలు మొదలెట్టారు. వారి కంటబడాలంటేనే భయం పట్టుకొంది.

"మీ అయ్య మనపాలిట శనిలా దాపురించాడే. అమ్మి తగలెట్టమని మనమేనాడన్నా పీకలమీద కూర్చున్నామా! డబ్బెట్లా వచ్చిందో అట్లాగే పొయ్యింది. ఆ ఎకరం వుండుంటే ఇయ్యాల కోటి రూపాయలు చేతికొచ్చేది" అంటూ అల్లుడు అంకమ్మ శివాలు మొదలెట్టాడు.

"దేనికైనా తినబుట్టుండాలే! ఈ ముసలాడికి పొలం అమ్మేదాకా నిదరపట్టి చస్తేనా!" పెద్దకొడుకు వీరభద్రుని అవతారం ఎత్తాడు.

"పిల్లల నోటికూడు తీశాడు ముసలోడు. ఏకాడికి తిని కూర్చుందామన్న రంధిబుట్టినోళ్లు బిడ్డల బాగోగుల గురించి ఆలోచిస్తారా!" పెద్దకోడలు వాళ్లని రెచ్చగొడుతూ వంతపాడింది.

"కనిపారెయ్యడం తప్పించి, ఏం తినబెట్టావని దబ్బిమ్మంటూ మా కొంపలు చుట్టూ తిరగడం. బంగారంలాంటి పొలం అయినకాడికి తెగనమ్మి మా గొంతులు కోశావు గదయ్యా" అంటూ చిన్న కొడుకు తిట్లకు లంఘించుకుంటున్నాడు.

చిన్న కోడలూ కనిపిస్తే చాలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నది. భూమి విలువ అమాంతం కోట్లవుతుందని తనేమన్నా కలగన్నాడా!

అగచాట్లు, అవమానాలు పళ్లేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో పొలం అమ్మాల్సివచ్చింది. అప్పటికి మంచి ధరే వచ్చిందని చంకలు గుద్దుకున్న మాట మర్చిపోయారు. కుటుంబపెద్ద అన్న ప్రేమ, గౌరవం ఎవరికీ లేకుండాపోయింది.

అయిన వాళ్లంతా కూడబలుక్కొన్నట్టు కక్ష గట్టారు. కత్తులు నూరతన్నారు. భూమిని జీవనాధారంగా కొలుస్తున్న రైతులు కూటికి లేకుండా పోతున్నారు. భూమిని వ్యాపార వస్తువుగా మలుస్తున్న వ్యాపారి కోట్లకు పడగలెత్తుతున్నాడు.

నింగీ, నేలా గురించి తప్ప మరో ధ్యాసలేకుండా బతికే రైతు అందరికీ పగోడైపొయ్యాడు. విత్తడం దగ్గర్నుంచీ పంట చేతికొచ్చిందాకా అడుగడుగునా గండాలే! అరకొర సాయాలూ, ఆర్భాటాలేగాని నిజంగా ఆదరించే దిక్కులేదు. ఏ కాడికీ రైతును దోచుకోవాలని చూసేవాళ్లేగాని, కాచుకోవాలని చూసే పుణ్యాత్ములే కరువయ్యారు.

"ఇదుగో పెద్దాయనా! మందులు జూసుకో, మొత్తం మూడొందల యాభై అయింది" షాపతని పిలుపుతో ఈ లోకంలోకొచ్చాడు ముత్తయ్య.

జేబులు తడిమాడు. తనదగ్గర అంత డబ్బెక్కడిది? ఒళ్లంతా మచ్చలు, దురదలు, డాక్టర్‌కి చూపించుకోవాలంటూ కొడుకుల ఇళ్లచుట్టూ చెడ తిరిగాడు. ఇంకా బతికి ఎవర్ని ఉద్ధరించాలంటూ, నోటికొచ్చినట్లు తిట్టి కొడుకులు చెరో వంద చేతిలో పెట్టారు. అందులో ఒక వంద డాక్టర్ ఫీజు కిందనే పోయింది. "అంత డబ్బు నాకాడ లేదయ్యా!" నసిగాడు ముత్తయ్య జేబు తడుముతూ.

"అయితే పదిరోజులకు సరిపడా ఇమ్మంటావా?" అడిగాడు షాపతను.

ఇది కేవలం మందుల్తో తగ్గే జబ్బు కాదని, మనసూ ప్రశాంతంగా వుండాలని డాక్టర్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి ముత్తయ్యకు. మందులు ఇమ్మంటానికి మనస్కరించలేదు. "డబ్బు చాలేట్టు లేదు. మళ్లీ వస్తాలే" అంటూ లేచాడు.

"ఏం మనుషులయ్యా! మా ప్రాణం తియ్యడానికి కాకుంటే, మందులు కొంటానికి డబ్బుల్లేకుండా డాక్టర్ దగ్గరకెందుకొస్తారు?" విసుక్కుంటూ ప్రిస్క్రిప్షన్ ముత్తయ్య చేతిలో కుక్కాడు.

ఇంటిదారి పట్టిన ముత్తయ్య చేతిలో ప్రిస్క్రిప్షన్ గాలికి రెపరెపలాడుతోంది. బతికినంతకాలం బిడ్డలు నానామాటలూ అనకా మానరు, తనుపడకా తప్పదు. మానని గాయంలా మనసు పుండవుతూనే వుంటుంది. ఎంతకూ తగ్గని ఈ మాయదారి రోగానికి మందూ మాకులెందుకు, డబ్బుదండగ!

చేతిలోవున్న ప్రిస్క్రిప్షన్ నలిపి, వుండచేసి గాలికి విసిరి పారేశాడు ముత్తయ్య.

*(స్వాతి, నవంబర్ 2007)*